## పాపభీతి

"ధర్మములలోకెల్లా భూతదయ సర్వోత్కృష్ట మైనది..." పిల్లవాడు కంఠతా పెడుతున్నాడు పాఠం—

తల్లి వింటూ భూతదయమీాద మనస్సును లగ్నం చేస్తోంది.

బయట జోరున వాన కురుస్తోంది.

ముష్టి ముసిల్ది వానలో తడిసి ముద్దై వడవడ వణుక్కుంటూ వరండాలోకి చేరింది.

''ఎవత్తైవే? వరండా పాడుజేస్తూ—పో—''

''పడుకోనీలే అమ్మా! పాపం—వాన''

'' దొంగముండర్లా...సర్లే! పడుకోవే. ''

పాఠం మహాత్యం పనిజేసింది.

''ఏనాటి కర్మో! ఒక్క ముద్దేనా దొరకలా.''

''వుసూరుమంటూ మాకెందుకా వుసురు. పో ముందు. పోతావా...''

''అయ్యో—తల్లీ'' ముసిల్ది 'ఉస్సురు'మంటూ చీకట్లో కలిసిపోయింది—

పిల్లవాడు ఆవులించి 'భూతదయ'ని మూసేశాడు—